

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు

నేడు అంకురార్పణ

తిరుచానూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరగనుంది. సోమవారం నుంచి జరిగే ఉత్సవాలకు తిరుచానూరు సిద్ధమైంది. అంకురార్పణ రోజు ఉదయం లక్ష కుంకుమార్చన నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాంచరాత్ర ఆగమోక్తంగా అర్చకులు అమ్మవారి అష్టోత్తర శతనామావళిని లక్ష సార్లు జపిస్తూ కుంకుమార్చన చేస్తారు. ఈ సేవలో పాల్గొనదలచిన దంపతులు రూ.1116 టిక్కెట్ కొనాలి. కుంకుమార్చనను భక్తులు కూర్చొని తిలకించేందుకు వీలుగా మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇక, తొమ్మిది రోజుల పాటు ఎటువంటి అవరోధాలు, ఆటంకాలు కలగకుండా బ్రహ్మోత్సవాలు జరగాలని సకల దేవతలను, అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తూ సాయంత్రం అంకురార్పణ గావిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారికి, విష్వక్సేనుడికి ఆలయంలో పూజలుచేస్తారు. అమ్మవారిని తిరుచ్చిపై కొలువుదీర్చి ఉద్యాన వనానికి వేంచేపు చేస్తారు. వెంట సర్వసేనాధిపతి విష్వక్సేనుడూ చేరుకుంటారు. అక్కడి పుట్టమట్టి సేకరించి ఆలయంలోని యాగశాలకు చేరుకుని పాలికల్లో పుట్టమట్టి, నవధాన్యాలు నింపి అంకురార్పణ చేస్తారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

సోమవారం ఉదయం 8-9 గంటల మధ్య ధనుర్లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు మొదలు కానున్నాయి. గజ పటాన్ని ధ్వజస్తంభానికి ఆరోహణం చేస్తారు. దీంతో ఉత్సవాలకు సకలదేవతలను ఆహ్వానిస్తారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రాత్రి ఏడు గంటలకు చిన్నశేషవాహనంతో అమ్మవారి వాహన సేవలు ప్రారంభమవుతాయి. రోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు అమ్మవారు వాహనాల్లో మాడవీధుల్లో ఊరేగుతున్నారు. ఆయావాహనాలను సిద్ధం చేశారు. విద్యుద్దీపాలంకరణలతో తిరుచానూరు దేదీప్యమానంగా వెలుగులీనుతోంది.



వాహన సేవలిలా.. : తొలిరోజైన 17వ తేది సాయంత్రం చిన్నశేషవాహనం, 18న పెద్దశేష హంస.. 19న ముత్యపుపందిరి, సింహ.. 20న కల్పవృక్ష, హనుమంత.. 21న పల్లకీ ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం, రాత్రి గజవాహనం.. 22న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణరథోత్సవం రాత్రి గరుడ వాహనం.. 23న సూర్యప్రభ, చంద్రప్రభ.. 24న రథోత్సవం, అశ్వవాహనంపై అమ్మవారు ఊరేగనున్నారు. దీంతో వాహన సేవలు ముగుస్తాయి. 25న మధ్యాహ్నం 12.10 గంటలకు పంచమితీర్థం(చక్రస్నానం), సాయంత్రం ధ్వజావరోహణం, 26న పుష్పయాగం జరగనుంది.

పది రోజుల పాటు ఆర్జిత సేవలు రద్దు



బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పది రోజులపాటు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ తెలిపారు. కుంకుమార్చన, వీఐపీ బ్రేక్, కల్యాణోత్సవంతో పాటు వారపు, మాసపు ఆర్జిత సేవలు ఉండవన్నారు. ఈనెల 27 నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమవుతాయని వివరించారు.

నాయుడుపేట సెజ్‌లో సోలార్ సెల్ పరిశ్రమ

తిరుపతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చొరవతో నాయుడుపేట సెజ్‌లో సోలార్ సెల్ పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. మెస్సర్స్ వోల్ట్‌సన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1743 కోట్ల పెట్టుబడి, 415 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ మోనో క్రిస్టలైన్ సోలార్ సెల్, బైఫేషియల్ సోలార్ మాడ్యూల్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదించింది. తొలిదశలో రూ.931 కోట్ల పెట్టుబడితో 234 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని వెల్లడించింది. రెండో దశలో రూ.812 కోట్ల పెట్టుబడితో 181 మందికి ఉద్యోగావకాశాలతో 2029 అక్టోబరు నాటికి పూర్తి చేస్తామని ప్రతిపాదించింది. దీనికి ప్రభుత్వం 37 ఎకరాలు కేటాయించింది. ఎకరా రూ.60 లక్షల చొప్పున సబ్సిడీ ధరతో అప్పగించనుంది. పెట్టుబడి రాయితీ కింద రూ.451.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని పదేళ్లలో విడతల వారీగా అందజేయనుంది. రూ.59.4 కోట్లు మించకుండా పదేళ్ల పాటు 50 శాతం సబ్సిడీతో 3 ఎంఎల్‌డీ నీటి సరఫరాకు అంగీకరించింది. రూ. 262.8 కోట్లు మించకుండా పదేళ్ళ పాటు యూనిట్‌కు రూపాయి చొప్పున విద్యుత్ ఛార్జీల రీయింబర్స్‌మెంట్ చేసేందుకూ అంగీకరించింది.

మరోసారి కౌన్సిల్ ముందుకు 'గ్రేటర్' పంచాయితీ

● అదనంగా 10 పంచాయతీలు
● 18న అత్యవసర సమావేశం

తిరుపతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రేటర్ పంచాయితీ మరోసారి మున్సిపల్ కౌన్సిల్ ముందుకు రానుంది. ఈనెల 18న అత్యవసర సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి కౌన్సిల్ సభ్యులకు అజెండా కాపీలు అందజేశారు. గత నెల 24న జరిగిన కౌన్సిల్ సమావేశంలో 63గ్రామాలను గ్రేటర్‌లో విలీనం ప్రతిపాదన చర్చకు రావడం.. వాదోపవాదాల నడుమ ఆమోదముద్ర వేయడం తెలిసిందే. నగరానికి అతిచేరువలో మిగిలిపోయినవి, ప్రజలు, ప్రజాప్రతినిధుల అభీష్టం.. భౌగోళిక స్వరూపం, పట్టణ లక్షణాలను పరిగణనలోకి తీసుకుని మరికొన్ని గ్రామాలు విలీనం చేసేందుకు ఆమోదం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటుచేస్తున్నారు.

కొత్తగా చేరనున్న పంచాయతీలు

తిరుపతి రూరల్ మండలంలోని బ్రాహ్మణపట్టు, కుంట్రపాకం, గాంధీపురం, పెరుమాళ్లపల్లి, పుదిపట్ల.. చంద్రగిరి మండలంలోని రాయలపురం, బుచ్చినాయుడుపల్లె, పిచ్చినాయుడుపల్లె.. రేణిగుంట మండలంలోని అత్తూరు.. ఆర్సీపురం మండలంలోని సి.రామాపురం.

విశాఖ సదస్సులో శ్రీసిటీకి భారీ పెట్టుబడులు

● సీఎంచే వర్చువల్‌గా 5 పరిశ్రమలు ప్రారంభం
● 12 కొత్త కంపెనీలకు ఎంవోయూలు
● రూ.31,450 కోట్ల పెట్టుబడులు, 1.1 లక్షల ఉద్యోగాల సృష్టి

సత్యవేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ భాగస్వామ్య సదస్సు-2025 రెండో రోజు శ్రీసిటీ భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ఐదు కొత్త పరిశ్రమలను ప్రారంభించారు. 12 కొత్త కంపెనీలకు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. డైకిన్, ప్రొటీరియల్(మెట్‌గ్లాస్)శ్రీసిటీ ఫేజ్-2 విస్తరణ జీవోలను సంబంధిత సంస్థల సీనియర్ ప్రతినిధులకు సీఎం అందజేశారు. మొత్తంగా రూ.31,450 కోట్ల పెట్టుబడులు, 1.1. లక్షలకుపైగా(ప్రత్యక్షంగా 70,600, పరోక్షంగా 39,400) ఉద్యోగాల సృష్టికి అవకాశాలు లభించాయి. శ్రీసిటీని ఉత్తమ పారిశ్రామిక నమూనాగా చంద్రబాబు అభివర్ణించారు. 50 దేశాలు, 500 కంపెనీలు, 1.5 లక్షల ఉద్యోగాల టార్గెట్ దిశగా కృషి చేయాలని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డికి నిర్దేశించారు. ఇందులో భాగంగానే అదనంగా 2,500 ఎకరాలను మంజూరు చేసిందని ప్రకటించారు. త్వరలో శ్రీసిటీ సమీపంలో ఎయిర్‌స్ట్రిప్ నిర్మిస్తామన్నారు. నెట్-జీరో, పునరుత్పాదక శక్తి, నీటి నిర్వహణతో భవిష్యత్-సిద్ధ పరిశ్రమ వ్యవస్థలను అభివృద్ధి చేయాలన్నారు. రాబోయే రెండేళ్ళలో శ్రీసిటీని 50 దేశాలకు నిలయంగా మార్చాలనే సీఎం లక్ష్యాన్ని సాధిస్తామని సన్నారెడ్డి చెప్పారు.



శ్రీసిటీ 2వ దశ విస్తరణ జీవోను సన్నారెడ్డికి అందజేస్తున్న సీఎం

లాసెట్ రెండో విడత ప్రవేశాలకు

నేటి నుంచి వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ లాసెట్‌లో రెండో విడత ప్రవేశాలకు ఆదివారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజును ఆదివారం నుంచి 19వ తేదీ వరకు చెల్లించొచ్చు. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ 'లాసెట్‌ను సందర్శించాలని కన్వీనర్ సీతా కుమారి తెలిపారు.

ముగిసిన 'నృత్య వాహిని'

పద్మావతి మహిళా వర్సిటీలో మూడు రోజులుగా నిర్వహించిన 'నృత్య వాహిని' కార్యక్రమం శనివారం ముగిసింది. మన సంస్కృతి, సంప్రదాయాలకు నృత్యం చిహ్నమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో దేశ, విదేశీ నృత్యకారులు పరస్పర కళా సంప్రదాయాలను తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ రజని, పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి







నిజాయితీకి ఇదా ఫలితం?

● సతీష్ కుమార్ మృతితో టీటీడీ అధికారులు, సిబ్బందిలో ఆందోళన

తిరుమల, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): పరకామణిలో చోరీని గుర్తించి ఫిర్యాదు చేసిన మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ విచారణకు హాజరయ్యేందుకు రైల్లో వస్తూ అనుమానస్పదంగా మృతి చెందడంతో టీటీడీ విజిలెన్స్ సిబ్బందిలో భయాందోళనలు నెలకొన్నాయి. ఆయనది ఆత్మహత్యాహత్యా అన్నది తేలాల్సి ఉండగా.. అసలు సౌమ్యుడిగా, నిజాయితీపరుడిగా, సేవాగుణమున్న అధికారిగా గుర్తింపున్న సతీష్‌కుమార్‌కి ఇటువంటి పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. చోరీ కేసులో బాధ్యతగా ఆయన ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత లోక్‌అదాలత్‌లో రాజీ అన్నది ఆయన స్థాయిలో తీసుకోగలిగిన నిర్ణయం కాదని అందరికీ తెలుసు. అప్పటి ముఖ్య అధికారులు ఎందరో ఉండగా సతీష్‌కుమార్‌ను ఎందుకు గురిపెట్టారో అంతుపట్టడం లేదు. రాజీ చేసుకోమని ఒత్తిడి చేసిన పైవాళ్లు ఎవరో చెప్పమంటూ సీఐడీ విచారణలో ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఆయన ఎవరి పేర్లు చెబుతారో అనే ఆందోళనతో అప్పటి నాయకులు, అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన ఒత్తిడికి గురవడం సహజం. ఇటువంటి ఒత్తిడి ఉంటే టీటీడీ విజిలెన్స్ విభాగంలో విధులు నిర్వహించడం కష్టం అవుతుంది. నిత్యం భక్తులతో కిటకిటలాడే తిరుమలలో మోసాలూ, నేరాలూ జరుగుతూనే ఉంటాయి. వీటిని గుర్తించి కేసులు పెట్టేపని విజిలెన్స్ విభాగంది. భక్తుల ఫిర్యాదుల ఆధారంగానూ విచారించి కేసులు పెడుతుంటారు. దర్శనాల దళారీలకు సహజంగానే రాజకీయ నాయకులతో ఎంతో కొంత సంబంధాలుంటాయి. ఇందువల్ల ఎవరిమీద కేసు పెడితే ఏమవుతుందో అనే సంకోచం వీరిలో ఉంటుంది. కేసులు పెడితే ఓ సమస్య, పెట్టకుంటే మరో సమస్య. ఎటు కాలు కదిపినా కత్తిమీద సామే. అయినప్పటికీ స్వామిపై భక్తితో డెప్యుటేషన్‌పై టీటీడీలోకి వచ్చిన అధికారులు ధైర్యం చేసి కేసులు పెడుతుంటారు. ప్రభుత్వాలు మారిన తర్వాత అవే కేసులు వారికి తలనొప్పులు తీసుకురావడం సాధారణమైపోయింది. సతీష్‌కుమార్ మరణంతో ఇవన్నీ ఇప్పుడు చర్చగా మారాయి. కోట్లాది భక్తుల విశ్వాసాలకు కేంద్రమైన తిరుమలలో జరిగే నేరాలపట్ల తరతమ భేదం లేకుండా వ్యవహరించేలా విజిలెన్స్ విభాగానికి భరోసా ఇస్తే తప్ప ధైర్యంగా ముందడుగు వేయలేరు. అధికారంలో ఉన్నపుడు ఒకలా, దిగిపోయాక మరోలా వ్యవహరిస్తే తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లకతప్పదు.



డాక్టర్ కె.శివాజీ (ఫైల్ ఫొటో)

నేను చనిపోయినా

విద్యార్థులకు ఉపయోగపడాలి

● భర్త కోరిక మేరకు మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించిన భార్య

తిరుపతి(వైద్యం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'నా మృతదేహాన్ని మట్టిలో కలిపేయకుండా వైద్య విద్యార్థుల చదువుకు ఉపయోగపడేలా వారికి అప్పగించండి' అంటూ తన భర్త చెప్పిన మాట నెరవేర్చారామె. భర్తను కోల్పోయిన పుట్టెడు దుఖంలోనూ.. మృతదేహాన్ని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ ఘటన శనివారం స్విమ్స్‌లో చోటుచేసుకుంది. తిరుపతికి చెందిన డాక్టర్ కె.శివాజీ(68) పలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీకి పనిచేసేవారు. బోటనీ విభాగంలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. కిడ్నీ వ్యాధి బారిన పడిన ఆయన వారం రోజులుగా స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. తాను చనిపోయినా విద్యార్థులకు ఉపయోగపడాలంటూ తన భర్త చెప్పిన మాటను గుర్తుచేసుకున్నారు టీటీడీ సూపరింటెండెంట్ ఇందిర. పుట్టెడు దుఃఖంలోనూ తన భర్త మృతదేహాన్ని వైద్య విద్యార్థుల చదువు కోసం ఉపయోగపడాలని నిర్ణయించారు. స్విమ్స్ ఎంఎస్ డాక్టర్ రామ్ ఆధ్వర్యంలో శివాజీ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలోని అనాటమీ విభాగానికి అందించారు.

సుప్రీంకోర్టు సీజేకి సాదర వీడ్కోలు



సీజేఐకి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం శనివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తిరుగు పయనమయ్యారు. రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీవారి జ్ఞాపికను బహూకరించారు. ఆయనకు హైకోర్టు రిజిస్ట్రార్ పార్థసారథి, ఎస్పీ సుబ్బరాయుడు, ఉమ్మడి జిల్లా జడ్జి అరుణసారిక, తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్, ట్రైనీ కలెక్టర్ సందీప్ ఎరఘు, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి సాదర వీడ్కోలు పలికారు.

అమ్మవారి సేవలో జస్టిస్ సూర్యకాంత్

తిరుచానూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్ శనివారం రాత్రి తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, అర్చకులు స్వాగతం పలికారు. మూలమూర్తిని దర్శించుకున్న జస్టిస్ సూర్యకాంత్‌కు వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా ఈ నెల 24న ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రపంచ కప్ మొక్కు చెల్లించా

● తిరుమలలో తలనీలాలు సమర్పించిన క్రికెటర్ శ్రీచరణి

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచకప్ ఆడటానికి ముందే శ్రీవేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నా. విజయం లభించింది. మొక్కు చెల్లించుకోవడానికి తిరుమలకు వచ్చా'నని మహిళా క్రికెటర్ శ్రీచరణి తెలిపారు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఆమె శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రస్తుతం తాను డోమెస్టిక్ ఆడుతున్నట్టు ఆమె మీడియాకు తెలిపారు. కాగా, శుక్రవారం అలిపిరి నుంచి కాలినడకన తిరుమల చేరుకున్న శ్రీచరణి స్వామివారికి తలనీలాలు సమర్పించారు. కాగా, శ్రీవారి దర్శనానంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని శ్రీచరణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో ఛైర్మన్ సత్కరించి అభినందించారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.



శ్రీచరణిని అభినందిస్తున్న టీటీడీ ఛైర్మన్

పుస్తక పఠనంతో మేధో సంపత్తి



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

తిరుచానూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో మేధో సంపత్తి పెరుగుతుందని గ్రంథాలయ అధికారి శ్రీముఖి తెలిపారు. తిరుచానూరులోని గ్రంథాలయంలో శనివారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నీతి కథలు, పాటలు, గేయాలు, మహాభారతం, రామాయణం, నవలలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ కమిటీ మెంబర్లు చెంగయ్య, రామమూర్తినాయుడు, వెంకటపతినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

తిరుచానూరు, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి జనార్దనరెడ్డి అన్నారు. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. శిల్పారామం ఆవరణలో మొక్కలు నాటి, నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ అందరి భాగస్వామ్యం తోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సత్యవేడు ఇన్‌చార్జి కూరపాటి శంకర్‌రెడ్డి, శిల్పారామం ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

తిరుమలలో పట్టుబడ్డ ఎర్రచందనం

● ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం నాలుగు ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో అటవీశాఖ అధకారులు నిఘా పెట్టారు. పాపవినాశనంకు సమీపంలో ఉదయం 10 గంటల సమయంలో ముగ్గురు అనుమానస్పదంగా ఉన్నట్టు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించే క్రమంలో ఒకరు పారిపోగా ఇద్దరు పట్టుబడ్డారు. ఆ ఇద్దరూ తమిళనాడులోని సేలంకు చెందిన అశోక్, రమేష్‌గా గుర్తించారు. వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.లక్ష ఉంటుందని ఫారెస్ట్ అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఫారెస్ట్ అధికారులు స్వప్నకుమారి, అఖిల్, మావిళ్లమండ బేస్ క్యాంపు వాచర్లు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

● రూ.6 లక్షల జరిమానా



నిందితుడ్ని తీసుకెళుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శనివారం తీర్పుచెప్పారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లాకు చెందిన అన్నామలై విజయకుమార్ ఎనిమిదేళ్ల కిందట టీఎన్ పాలెం బీటు పరిధిలో ఎర్రచందనం దుంగలను తరలించే క్రమంలో అప్పటి పోలీసులు, అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ కేసులో అరెస్టయిన అన్నామలై విజయకుమార్ కొంతకాలంగా బెయిల్‌పై ఉన్నాడు. ఈ కేసు ఇటీవల తిరుపతి ఎర్రచందనం కోర్టుకు బదిలీ అయింది. న్యాయమూర్తి కొంత కాలంగా కేసు విచారించారు. నిందితుడు కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేశారు. పోలీసులు తమిళనాడుకు వెళ్లి నిందితుడిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి అన్నామలై విజయకుమార్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఆయన్ను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 9 దుంగల స్వాధీనం

మంగళం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో శనివారం తెల్లవారుజామున ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ బృందం చంద్రగిరి- శ్రీవారిమెట్టు మార్గంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. వేగంగా వస్తున్న కారు పోలీసులను గమనించి కొద్దిదూరంలో ఆగింది. పోలీసులు కారును సమీపించేలోపు కొందరు వ్యక్తులు కారును దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబండించి ఇద్దరిని పట్టుకోగలిగారు. వీరు తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి, ధర్మపురి జిల్లాలకు చెందిన వారుగా విచారణలో తేలింది. కారుతో పాటు 9 ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో వాయు కాలుష్యం ఎంత?

● తగ్గించే దిశగా పరిశోధనలు జరగాలి

● ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ వార్షికోత్సవంలో శాస్త్రవేత్తలు

ఏర్పేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి, విజయవాడ, ఢిల్లీ తదితర నగరాల్లో వాయుకాలుష్యం తీవ్రత ఏ స్థాయిలో పెరిగిందో, దీనికి కారణాలేంటనే దానిపై శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఏఐ టెక్నాలజీని వినియోగించుకుంటూ వాయుకాలుష్యాన్ని తగ్గించే దిశగా పరిశోధనలు జరగాలని అభిప్రాయపడ్డారు. ఏర్పేడు సమీపంలోని ఐసర్ ప్రాంగణంలో రెండు రోజులుగా ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 91వ వార్షిక సదస్సు జరుగుతోంది. పలు ఆవిష్కరణలు, పరిశోధనలపై శనివారం శాస్త్రవేత్తలు విస్తృతంగా చర్చించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ఆరోగ్యానికి ముప్పు తగ్గించేలా పరిశోధనలు జరగాలన్నారు. మానవ నిర్మిత మేధస్సు పెరిగి కృత్రిమ మేధస్సు ఎదుగుదలకు ఉపయోగపడాలని ఐఐఎస్‌సీ శాస్త్రవేత్త విజయచంద్రు సూచించారు. ప్రపంచాన్ని పరుగులు పెట్టించే ఆవిష్కరణలపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టాలని పలువురు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ అంటే ఏమిటో తెలియని రోజుల్లో చేసిన ఆవిష్కరణలు ప్రపంచానికి ఇప్పుడు కొత్త దారిని చూపిస్తున్నాయని చెప్పారు. శాస్త్రవేత్తల ద్వారానే సెల్‌ఫోన్లు, రేడియోలు, టీవీలు, ఎలక్ట్రో ఫొటోగ్రఫీ వంటివి అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేసుకున్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో ఆలయాల కోసం భూసేకరణ జరగాలి : ఈవో

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం కోసం భూమిని గుర్తించి సేకరించాల్సిందిగా కోరుతూ ఆయా కలెక్టర్లకు లేఖలు రాయాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాబృందాలను అభినందిస్తూ ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాయలని, సంబంధిత కళాబృందాల ఫొటోలను పంపాలని సూచించారు. వినాయక నగర్ క్వార్టర్స్‌లో పెయింటిగ్స్, క్లీనింగ్ పనులు చేపట్టాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అమరావతి, తిరుచానూరు ఆలయాల మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, ఐటీ జీఎం ఫణికుమార్ నాయుడు పాల్గొన్నారు.

నగదు లెక్కింపు మిషన్ వితరణ



తిరుచానూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి యోగిమల్లవరంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు శనివారం రూ.3.45లక్షల విలువ చేసే నగదు లెక్కింపు మిషన్‌ను వితరణ చేశారు. డిప్యూటీ ఈవో హరిందన్‌నాథ్, దేవరాజులకు బ్యాంకు అధికారులు ఈ మిషన్‌ను అందజేశారు. పరకామణిలో వినియోగించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. యూనియన్ బ్యాంకు జీఎం, జోనల్ మేనేజరు పత్రి శ్రీనివాస కుమార్, రీజనల్ మేనేజరు సోమంచి శర్మ, బ్రాంచి మేనేజరు బి.ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు చెత్తబుట్టల వితరణ



చెత్తబుట్టలు అందజేస్తున్న డీఎల్‌డీవో నారాయణరెడ్డి, కార్యదర్శి మణి

తిరుచానూరు, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరం ప్రభుత్వ పాఠశాలలకు అధికారులు చెత్తబుట్టలు అందజేశారు. డీఎల్‌డీవో నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మణి మాట్లాడుతూ గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఇంటికీ రెండు చెత్త బుట్టలను అందజేశామని తెలిపారు. అలాగే పాఠశాలల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు బుట్టలను అందజేశామన్నారు.

సుస్థిర లక్ష్యాలతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీవో గిడ్డయ్య

భాకరాపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సుస్థిర లక్ష్యాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరికంలేని సమాజం, ప్రజల జీవన ప్రమాణ స్థాయి పెంచడం, సామాజిక న్యాయం, చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణ, పచ్చదనం, పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు అందజేస్తున్న చినబాబు

రామచంద్రాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు శనివారం ఉచిత సైకిళ్ల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ దూరప్రాంతాల నుంచి నడిచివచ్చే పేద గిరిజన విద్యార్థులకు సొంత నిధులతో సైకిళ్ల అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సభాపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినబాబుకు సన్మానం



చినబాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా నియమితులైన చినబాబును కమ్మపల్లిలోని ఆయన స్వగృహంలో అనుపల్లి టీడీపీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్‌నాయుడు, దేవరాజులు, టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, విజయ కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీల పంపిణీ

రామచంద్రాపురం, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవ తీసుకుని మండలంలోని అనుపల్లి, నెత్తకుప్పం, కుప్పంబాదూరు, సొరకాలయ పాళెం, శ్రీరామపురం పంచాయతీలకు ట్రాక్టర్ ట్రాలీలను శనివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆంధ్రమిషన్ నిధులను మంజూరు చేయించి పంచాయతీలకు ఈ ట్రాలీలను అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చిన్నగొట్టిగల్లుకు చెందిన సావిత్రికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు/ భాకరాపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయనిధి ద్వారా రూ.50.02లక్షల చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం అందజేశారు. రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో తిరుపతి రూరల్, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన పలువురు బాధితులకు వాటిని అందజేశారు. వారు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చిన్నగొట్టిగల్లు మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి, టీడీపీ నేత విజయశేఖర గౌడ్, మహి రాయల్, సురేంద్ర పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలతో అవకతవకలకు చెక్



మాట్లాడుతున్న పీడీ శోభన్‌బాబు, పక్కన ఏపీఎం నాగేశ్వరరావు

తిరుపతిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లోని మహిళా సభ్యులు డిజిటల్ లావాదేవీలు నిర్వహించడం ద్వారా అవకతవకలకు తావులేకుండా ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. తిరుపతి రూరల్ మండల వెలుగు మహిళా సమాఖ్య సంఘమిత్రలకు శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ మండల మహిళా సమాఖ్య ఆదర్శంగా ఉండేలా కృషి చేయాలన్నారు. మన డబ్బులు-మన లెక్కల యాప్‌పై సభ్యులందరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఏపీఎం నాగేశ్వరరావు, దుర్వాసులునాయుడు, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మోహన్‌కుమారి పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం
ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



మృతి చెందిన లక్ష్మీకాంత్

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లె వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో శనివారం సాయంత్రం ముందు వెళుతున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలం అనుకూరపల్లికి చెందిన లక్ష్మీకాంత్(20) తిరుపతిలోని తన బంధువులు ఇంట్లో ఉంటూ పూతలపట్టు మండలంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం తన ద్విచక్ర వాహనంపై కళాశాల నుంచి తిరిగి వస్తుండగా నడింపల్లె వద్ద ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా వేగాన్ని అదుపు చేయడంతో వెనుక వస్తున్న లక్ష్మీకాంత్ దాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆ యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల శుభ్రతతోనే మంచి సమాజం



పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతోనే మంచి సమాజం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. మొక్కలు నాటడం వలన కాలుష్యాన్ని నియంత్రించవచ్చునని తెలిపారు. అనంతరం వెలుగు కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఇవి తోడ్పడతాయన్నారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటరత్నం, ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, టీడీపీ సీనియర్ నాయకులు శివకోటేశ్వరరెడ్డి, కోదండరామానాయుడు, ఏపీఎం గంగయ్య పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ మహోత్సవం



పడి పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పాతపేటలో చేగు నిలయం అయ్యప్పస్వామి పడి పూజ మహోత్సవాన్ని శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. చంద్రగిరికి చెందిన వ్యాపారవేత్త చేగు మునిలక్ష్మీనారాయణ, చేగు ప్రసాంత్‌గుప్తా ఆధ్వర్యంలో, కేరళ రాష్ట్రం శబరిమలై ఆలయానికి చెందిన జనార్దన్ నంబూద్రిస్వామి నేతృత్వంలో అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి పాలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చక్రాల చిన్నిస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి భక్తి పాటలతో ఆప్రాంతం మార్మోగింది. అయ్యప్ప స్వాములకు చేగు మునిలక్ష్మీనారాయణ, చేగు ప్రశాంత్‌గుప్తా తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

బంగారు, వెండి, నగదు, బైక్ స్వాధీనం



నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, నగదు, స్కూటర్

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో పలు చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను చంద్రగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. బంగారం, వెండి, నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ప్రసాద్ వివరాల మేరకు.. కేఎంఎం కళాశాల వద్ద చంద్రగిరి పోలీసులు శనివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ముగ్గురు వ్యక్తులు తిరుపతి నుంచి పీలేరు వైపు బైక్‌పై వెళుతూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. విచారణలో వారు అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన రామాంజనేయులు, తిరుపతికి చెందిన సత్యసారథి, చాట్ల నరేంద్రలుగా తెలిసింది. వీరు చంద్రగిరి మండలంలో 8, తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చోరీ చేసినట్లు గుర్తించారు. రామాంజనేయులు గతంలో అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లో చోరీలకు పాల్పడి, జైలుకు వెళ్లి వచ్చినట్లు విచారణలో తెలిసింది. వారి నుంచి 50 గ్రాముల బంగారం, 1100 గ్రాముల వెండి, రూ.10 వేల నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు. సిబ్బందిని డీఎస్పీ అభినందించి, రివార్డ్ అందజేశారు.

సతీష్‌కుమార్‌ది ఆత్మహత్యని మీకెవరు చెప్పారు?

● భూమనను ప్రశ్నించిన సుగుణమ్మ



తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'పరకామణి కేసులో సీఐడీ విచారణకు హాజరయ్యేందుకు వస్తూ టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ హత్యకు గురవడం బాధాకరం. ఆయన మృతి విషయం తెలిసిన గంటన్నర వ్యవధిలోనే టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మీడియా ముందుకొచ్చారు. విచారణలో తన పేరు చెప్పాలంటూ అధికారులు ఒత్తిడి చేయడంతో సతీష్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన చెప్పారు. సతీష్ ఆత్మహత్య చేసుకున్నారని మీకెవరు చెప్పారు? ఎలా తెలిసింది' అంటూ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ శనివారం భూమనను ప్రశ్నించారు. పరకామణి, కల్తీ నెయ్యి కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న వారందరికీ రక్షణ కల్పించాలని ఆమె డీజీపీని కోరారు. ముందుగా టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి, మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిని విచారిస్తే అసలు దొంగలు ఎవరో తెలుస్తుందని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. సుధాకర్‌రెడ్డి, చిన్నబాబు, కృష్ణయాదవ్, బుల్లెట్ రమణ, మణ్యంశ్రీనివాసులు, కంకణాల రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌ను బెదిరించారని చెప్పిందెవరు?

సీఐడీ విచారణలో సతీష్‌కుమార్‌ను న్యాయవాది లక్ష్మణరావు బెదిరించారని కరుణాకరరెడ్డికి ఎవరు చెప్పారంటూ జనసేన నేత కిరణ్‌రాయల్ ప్రశ్నించారు. సతీష్‌కుమార్‌కు భూమన, ధర్మారెడ్డి టచ్‌లో ఉన్నారన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, భారీ సుపారీ ఇచ్చి సతీష్‌ను చంపేశారని ఆరోపించారు. అధికారంలేకున్నా హత్యలు ఎలా చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. భూమన ఎప్పుడు వైద్యుడు అయ్యారో తెలియదని, పోస్టుమార్టం రిపోర్టు కూడా ఇయనే ఇచ్చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రవికుమార్‌కు భద్రత కల్పించాలని కోరారు.



అలరించిన నృత్యాలు



పద్మావతి మహిళా వర్సిటీలో శనివారం నత్య వాహిని ముగింపు సందర్భంగా కళాకారులతో వర్సిటీ అధికారులు. మూడో రోజు నృత్య ప్రదర్శన

అప్రకటిత విద్యుత్ కోతతో ప్రజల అవస్థలు

పాకాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 7-30 గంటల నుంచి సాయంత్రం 6-30 గంటల వరకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు అవస్థలు పడ్డారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం గురించి విద్యుత్ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా 11 గంటల పాటు నిలిపేయడంతో తాగునీరు, ఇతర అవసరాల కోసం దామలచెరువు, పదిపుట్లబైలు, మొగరాల, బందార్లపల్లె పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కల్యాణ వెంకన్న సేవలో హైదరాబాద్ సీపీ



ఆలయంలో సజ్జనార్, కుటుంబ సభ్యులు

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామిని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈవో గోపినాథ్, ఎస్ఐ అనిత పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రకు కృషి చేయాలి

పాకాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలను స్వచ్ఛంగా మార్చేందుకు ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో వాసుదేవరావు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, కాటన్ బ్యాగులు వినియోగించాలన్నారు. జలవనరులను రక్షించుకోవాలని కోరారు. కార్యదర్శులు శ్రీలేఖ, ధరణీకుమార్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

పాకాల, నవం బరు 15 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యా యులు కృషి చేయా లని ఎంఈవో బాబ్జీ కోరారు. స్థానిక ఎమ్మా ర్సీ కార్యాల యంలో శనివారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఉదయం, మధ్యాహ్నం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమతమ్మ, సుమలత, జ్యోతి వెంకటరత్నం, జయచంద్ర, రామకృష్ణ, గీత, సీఆర్పీలు పాల్గొన్నారు.

పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడుకుందాం

భాకరాపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా పెట్టుకుని పర్యా వరణాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లులో శనివారం ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, సూపరింటెండెంట్ సతీశ్‌కుమార్, ఆర్ఐ జానకీరామ్, కార్యదర్శులు వెంకటేశులు, గిరిబాబు, రామ్మోహన్, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, రోహి సంస్థ అధ్యక్షుడు సహదేవయ్య, టీడీపీ నేతలు ఆర్వీ రమణారెడ్డి, మల్లికార్జున రెడ్డి, హైదర్‌వలీ, బెల్లంకొండ రమణ పాల్గొన్నారు.

లావాదేవీలు లేని ఖాతాల్లో సొమ్ము వెనక్కి తీసుకోండి

తిరుచానూరు: పదేళ్లుగా లావాదేవీలు జరపకుండా ఉన్న బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును వెనక్కు తీసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రవికుమార్ కోరారు. ఆర్‌బీఐ అధికారులు దీనిపై తిరుచానూరులో శనివారం అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌బీఐ లీడ్ జిల్లా అధికారి గిరిధర్ బెహరా మాట్లా డుతూ ఆర్‌బీఐ తీసుకువచ్చిన 'మీ డబ్బు మీహక్కు'ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వారిలో.. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తమిళ్‌సెల్వి, జస్టిస్ తిలగవతి, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ పాడియా, కర్ణాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అశోక్ హించిగిరి ఉన్నారు. అలాగే సినీనటుడు రవిప్రకాష్, ఇంకా 18 మంది ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం కూడా శ్రీవారిని దర్శించుకుంది.

బాధితులకు పరిహారం అందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మురళి, అంజయ్య తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళ్లూరు రాయలచెరువుకు గండిపడి సర్వం కోల్పోయిన కళత్తూరు దళితవాడ వాసులకు పరిహారం అందించాలని అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ కళత్తూరులోని దళిత కుటుంబాలకు ఐదు ఎకరాల భూమితో పాటు శాశ్వత గృహ నిర్మాణం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. రూ.25లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు రాంభూపాల్‌రెడ్డి, జయచంద్ర, రాధాకృష్ణ, వేణుగోపాల్, కాటయ్య, పరశురాముడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రేణిగుంట బస్టాండులో కార్గో ఉపకేంద్రం ప్రారంభం



కార్గో ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అలిపిరి డిపో పరిధిలోని రేణిగుంట బస్టాండులో ఆర్టీసీ కార్గో ఉపకేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కమర్షియల్ ఏటీఎం నిర్మల, అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ ఇక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కార్గో కేంద్రాలున్న అన్ని ప్రాంతాలకు, చెన్నై, బెంగళూరు, హైదరాబాదుకు తక్కువ ఖర్చుతో త్వరితగతిన కొరియర్స్, పార్సిల్స్ పంపవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7670940581ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంపురుషోత్తం, సింహాద్రి పాల్గొన్నారు.

స్నూకర్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక న్యూ బాలాజీ కాలనీలోని స్నూకర్ క్లబ్‌లో శనివారం స్నూకర్ టోర్నమెంట్ ప్రారంభమైంది. శాప్ ఛైర్మన్ రవినాయుడు ఈ టోర్నీని ప్రారంభించి, నిర్వాహకుడు, లక్కీ బాల్స్ అండ్ బాయ్స్ స్నూకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్‌చౌదరిని అభినందించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నీలో రాష్ట్రవ్యాప్తంగా 24మంది మహిళ, పురుష క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ సందీప్, విష్ణు, హేమంత్‌రాయల్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఈఈ గంగాధర్ రెడ్డి

తిరుపతి (ఆటోనగర్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో అదనపు లోడ్ వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు విఫలమయ్యే ప్రమాదముందని, క్షేత్రస్థాయిలో ఏఈలు, ఉద్యోగులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈఈ సి.గంగాధర్ రెడ్డి ఆదేశించారు. తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని అవిలాల సెక్షన్‌లో ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్‌లు) లోడ్‌పై నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మొండి బకాయిలు వందశాతం వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈఈ జయప్రకాష్, ఏఈ శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా వెంకటేష్‌గౌడ్



వెంకటేష్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ తిరుపతి నగర అధ్యక్షుడిగా వెంకటేష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ యువత హక్కుల కోసం పోరాడతామని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో చెప్పిన నిరుద్యోగ భృతిని వెంటనే ఇచ్చేలా కృషి చేస్తామని అన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి గౌడ్, మమత నాగిరెడ్డి పాల్గొన్నారు.

శంకరంబాడి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించండి



కమిషనర్ మౌర్యకు వినతిపత్రం ఇస్తున్న సామంచి, మునికృష్ణ తదితరులు

తిరుపతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయ రచయిత శంకరంబాడి సుందరాచారి విగ్రహాన్ని లక్ష్మీపురం సర్కిల్లో పునఃప్రతిష్ఠించాలని కూటమి నేతలు కోరారు. శనివారం లక్ష్మీపురం సర్కిల్‌ను పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన కార్పొరేటర్ ఎస్కే బాబు కమిషనర్ మౌర్యను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్కిల్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ ఐలాండ్‌లో, సరైన ప్రదేశంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు వచ్చింది. శుక్రవారం 66,709మంది భక్తులు దర్శించుకున్నారు. 24,053 మంది తలనీలాలు సమర్పించారు.

నన్ను ఆశీర్వదించండి : యువ



తిరుపతి, నవంబరు15 (ఆంధ్ర జ్యోతి) : ప్రేమిస్తున్నా సినిమా ఉభయ రాష్ట్రాల్లో విడుదలై మన్ననలు పొందుతోందని ఇందులో కీలకపాత్ర పోషించిన నటుడు యువ పేర్కొన్నారు. శనివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. తనకు బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి, తమన్నా నటించిన ఓదెల-2తో మంచిపేరు వచ్చిందన్నారు. ప్రస్తుతం శర్వానంద్ నటిస్తున్న భోగి సినిమాలో నటిస్తున్నానని, తెలుగు ప్రేక్షకుల ఆదరాభిమానాలు తనపై ఉండాలని కోరారు.

పరకామణి కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి కుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. పరకామణిలో జరిగిన దొంగతనంపై ఫిర్యాదు చేసిన నాటి ఏవీఎస్వో సతీష్‌కుమార్‌ను అగంతకులు హత్య చేశారని, దీని వెనుక సూత్రధారులు, పాత్రధారులు ఎవరనేది వెలికితీయాలని కోరారు. మాచర్ల శ్రీనివాసులు తనకు రక్షణ కల్పించాలని ఎస్పీని కోరడం వెనుక కేసు తీవ్రత అర్థమవుతోందని పేర్కొన్నారు. సాదాసీదా ఉద్యోగిగా ఉన్న రవికుమార్‌కు రూ.వందల కోట్లు ఎలా వచ్చాయో బయటకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రవీణ్‌కు సకలకళావల్లభ అవార్డు



తిరుపతి అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య తిరుపతికి చెందిన ఎలమంచలి ప్రవీణ్‌కి సకలకళా వల్లభ అవార్డును ప్రకటించింది. ఈనెల 18న విజయవాడలో వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

చిన్నగొట్టిగల్లు 'విండో' సీఈవో సస్పెన్షన్



జగదీశ్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు సింగిల్ విండోలో నకిలీ బంగారాన్ని కుదువపెట్టి రూ. 72 లక్షలు స్వాహా చేసిన ఘటనకు సంబంధించి అక్కడి సీఈవో జగదీశ్‌ను సస్పెండ్ చేస్తూ సింగిల్ విండో అధ్యక్షుడు ముత్తా ప్రభాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి 18, 21, ఫిబ్రవరి 11 తేదీలలో 1235 గ్రాముల వన్ గ్రామ్ గోల్డ్‌ను 29 సంచుల్లో కె.రెడ్డెమ్మ, సి.రుతున్ పేరిట కుదువపెట్టి రూ. 72 లక్షలు అక్కడి సీఈవో జగదీశ్ స్వాహా చేశారు. ఈ వ్యవహారాన్ని చిన్నిగొట్టిగల్లు డీసీసీబీ బ్రాంచి మేనేజర్ లక్ష్మీప్రసాద్ గుర్తించి అధికారులకు ప్రాథమిక నివేదికను ఇచ్చారు. జగదీశ్ స్థానంలో బ్యాంకు సూపర్‌వైజర్ రెడ్డి శ్రావణ్‌ను నియమించారు. ఇదిలా ఉండగా సింగిల్ విండోలో వీటితో పాటు కుదువ ఉంచిన బంగారం వివరాలను బ్యాంకు అధికారులు పరిశీలిస్తున్నారు. డీసీసీబీ ఏజీఎం సురేష్‌బాబు విచారణ చేపట్టారు. త్వరలో ఈ సంఘటనపై సీఈవో జగదీశ్‌పై పోలీసు కేసు నమోదు చేసే అవకాశం ఉంది.

వర్సిటీలు, కాలేజీల్లో పచ్చదనం - పరిశుభ్రత

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు





ఎస్వీయూలో పాల్గొన్న వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు- విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పద్మావతి కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ అధికారి కృష్ణవేణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలు, కాలేజీల్లో శనివారం పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీయూలో ప్రతినెలా మూడవ శనివారం క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా ఆహ్లాదం, ఆరోగ్యం కలుగుతుందన్నారు. ● పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ లలితకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ● పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించడం వల్ల చాలా రోగాలు దరిచేరవన్నారు. హాస్టల్లో శుభ్రత పాటిస్తే అంటురోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ఎన్‌సీసీ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ మొక్కల పెంపకంపై విద్యార్థులు శ్రద్ధ వహించాలన్నారు.

తిరుపతిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయండి



సీఎంతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తనయుడు జగన్

తిరుపతి అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని, తద్వారా యువతకు ఉపాధి కల్పించాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. విశాఖలో రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో తనయుడు జగన్‌తో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు కందుల దుర్గేష్, సవితతో కలసి స్టాల్స్‌ను పరిశీలించారు. అంచనాకు మించి సదస్సు విజయవంతమైందని అభిప్రాయపడ్డారు.

విద్యార్థులకు చేయూతనందించండి : డీఈవో



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న డీఈవో, రమేష్‌నాథ్

తిరుపతి(విద్య), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు, దాతలు పేద విద్యార్థులకు చేయూతనివ్వాలని డీఈవో కేవీఎన్ కుమార్ కోరారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో 30 మంది గిరిజన విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. డీఈవో మాట్లాడుతూ గ్లోబల్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని, దానికి తమవంతు సాయం చేస్తూ ఉంటానని తెలిపారు. జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ రావు, డీఈవో కార్యాలయాధికారి ధనుంజయనాయుడు, ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ మొర్రమేకల దేవరాజులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మల్లారపు నాగార్జున, దివ్యాంగ్ మునిలక్ష్మి, జన విజ్ఞాన వేదిక రెడ్డెప్ప పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేయొద్దు



మాట్లాడుతున్న టౌన్‌బ్యాంకు చైర్మన్ జయచంద్రారెడ్డి

తిరుపతి(జీవకోన), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయవద్దని టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి కోరారు. శనివారం స్థానిక డీబీఆర్ రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు లోకేష్, రాము, వెంకటేష్, ప్రసాద్, సుధ, సురేష్, శేషు, స్థానికులు పాల్గొన్నారు.

ఆదివాసుల ఉన్నతే బీజేపీ లక్ష్యం

● బిర్సా ముండా జయంతి సభలో సామంచి



బిర్సా ముండాకు పుష్పాంజలి ఘటిస్తున్న సామంచి శ్రీనివాస్, ఇతర నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసుల ఉన్నతే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసి నేత బిర్సా ముండా 150 జయంతి కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సామంచి మాట్లాడుతూ పార్లమెంటు ప్రాంగణంలో బిర్సా ముం డా విగ్రహ ప్రతిష్ఠ ఆదివాసీల పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు అనుషా రామకృష్ణ, నరేంద్ర రెడ్డి, మల్లకుప్పం శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేష్ బాబు, జిల్లా కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, పూర్వ ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన

తిరుపతి(వైద్యం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో వచ్చే గుండె జబ్బులు, వాటికి గల కారణాలు, చికిత్సా విధానాలపై స్విమ్స్‌లో 'పదిలం పదిలం పసిహృదయం' పేరుతో నిర్వహించిన రెండు రోజుల అవగాహన కార్యక్రమం విజయ వంతమైందని డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలి పారు. స్విమ్స్ శ్రీపద్మావతి ఓపీడీ బ్లాక్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శనివారం స్విమ్స్ యునివర్సిటీలోని విద్యార్థులతోపాటు వైద్య సిబ్బంది, రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి కార్య క్రమాలను కొనసాగిస్తామని కుమార్ పేర్కొన్నారు.

శ్రీవారికి కానుకగా ఎలక్ట్రిక్ బస్సు



తిరుమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శనివారం ఓ ఎలక్ట్రిక్ బస్సు విరాళంగా అందింది. పూణేకు చెందిన పినాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.74.24 లక్షల విలువైన ఈ బస్సును అందజేసింది. ఆలయం ముందు పూజలు నిర్వహించాక ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ట్రాన్స్‌పోర్టు డీఐ వెంకటాద్రి నాయుడికి తాళాలను అందజేశారు. భక్తుల ఉచిత ప్రయాణానికి ఈ బస్సును వినియోగించనున్నారు.

ఇంటిని కూల్చేశారంటూ కలెక్టరేట్ వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన



పెట్రోల్ బాటిల్ ముందు పెట్టుకుని ఆందోళన చేస్తున్న రాజేంద్రప్రసాద్, సిరి తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ తమ ఇంటిని అకారణంగా కూల్చివేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని రాజేంద్రప్రసాద్, ఆయన బంధువులు శనివారం కలెక్టరేట్ వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేపట్టారు. మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించామని చెప్పినా వినకుండా మున్సిపల్ సిబ్బంది ఇంటిని తొలగించారని, అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని రాజేంద్రప్రసాద్, అతని బంధువు యోగానంద్ తెలిపారు. నోటీసులు ఇవ్వకుండా ఇల్లు కూల్చివేయడం దారుణమన్నారు. న్యాయం చేయకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడుతామని రాజేంద్రప్రసాద్, ఆ ఇంట్లో నివాసముంటున్న సిరి చెప్పడంతో తిరుచానూరు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అధికారుల విధులకు ఆటంకం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టరేట్ ఏవో రమేష్‌బాబు తెలిపారు. కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

వినియోగదారులకు సత్వర సేవలు అందించండి



మాట్లాడుతున్న ఎస్ఈ చంద్రశేఖరరావు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యుత్ వినియోగదారులకు సత్వర సేవలు అందించాలని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ వి.చంద్రశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. పాత తిరుచానూరు రోడ్డులోని తిరుపతి రూరల్ డివిజన్ కార్యాలయంలో శనివారం డివిజన్ స్థాయి అధికారులు, ఉద్యోగ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ వినియోగదారులు సమస్యలపై ఫిర్యాదు చేసినపుడు ప్రాధాన్యతను బట్టి త్వరితగతిన సేవలు అందించాలన్నారు. సరఫరాలో అంతరాయం రాకుండా ముందు జాగ్రత్త తీసుకోవాలన్నారు. బిల్లులను నిర్ణీత సమయంలో వసూలు చేయాలన్నారు. పాత బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. డీటీఆర్‌లకు స్మార్ట్ మీటర్లు అమర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఏవో కె.శ్రీనివాసులు, ఈఈ చిన్నరెడ్డెప్ప, డిప్యూటీ ఈఈలు వెంకటరమణ, సుబ్రమణ్యం, సుధాకర్, రామిరెడ్డి, ఏఈలు ఎల్.చలపతి, రాజేష్, బాలాజీ పాల్గొన్నారు.

'ప్రేమిస్తున్నా' హీరోయిన్ మన తిరుపతి అమ్మాయే



ప్రీతినేహ

తిరుపతి, నవంబరు15(ఆంధ్రజ్యోతి) : ప్రేమిస్తున్నా సినిమాలో హీరోయిన్‌గా నటించిన ప్రీతి నేహ మన తిరుపతి అమ్మాయి. తన కుమార్తె హీరోయిన్‌గా పరిచయమైన ఈ సినిమాను ఆదరించాలని ప్రీతి తండ్రి కొట్టే శివకుమార్ కోరారు. శనివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. తన కుమార్తె ప్రీతినేహ బెంగళూరులో బీబీఏ చదువుతూ ఉండగా ప్రేమిస్తున్నా చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం దక్కిందన్నారు. పలు చిత్రాలలో బాల నటుడిగా నటించిన హీరో సాత్విక్ వర్మ తొలిసారిగా హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో తన కుమార్తెకు కూడా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తిరుపతిలోని శ్రీనివాసతేజలో ప్రదర్శిస్తున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు.


సత్యనారాయణ
సమర్పించు
రమా ఫిలింస్
MEGA STAR AS COWBOY
Grand Re-Release
on 21st NOVEMBER
కొదమసింహం
4K
5.1 Digital
SANDHYA 70 MM ఆర్టీసీ క్రాస్ రోడ్స్
Booking Opens Today
K.నాగేశ్వరరావు B.Sc.
K.మురళీమోహనరావు
రాజ్ కోటి


DR. NAGESHWAR RAO PUJARI PRESENTS
DOLAMUKHI
MONSOON TALES
A WIN ORIGINAL PRODUCTION
WIN
రాజు weds రాంబాయి
NOVEMBER
21st
RELEASE
IN THEATERS
WRITTEN & DIRECTED BY SAAILU KAAMPATI
PRODUCED BY VENU UDUGULA, RAHUL MOPIDEVI


MYTHRI MOVIE MAKERS
GULSHAN KUMAR, BHUSHAN KUMAR & T-SERIES FILMS PRESENTS
TRAILER
LAUNCH
EVENT
ON 18TH NOV, 5PM ONWARDS
@KURNOOL OUT DOOR STADIUM
DRONE SHOW
FIRST TIME EVER IN TELUGU CINEMA
& KURNOOL
ANDHRA KING
తాలూకా
MAHESH BABU .P
NAVEEN YERNENI Y RAVI SHANKAR
BIOPIC OF A FAN
IN THEATRES
28TH NOV
WORLDWIDE
NETFLIX


SRI LAKSHMI JYOTHI CREATIONS
WORLDWIDE
IN THEATRES
NOV
21
ACTION KING ARJUN
AISHWARYA RAJESH
మఫ్టీ పోలీస్
WRITTEN & DIRECTED BY DINESH LAKSHMANAN
PRODUCED BY G ARULKUMAR
SRI LAKSHMI JYOTHI CREATIONS BALAJI RELEASE
SOUTH INDIA THEATRICAL V.M.DEVARAJ RELEASE
TAMIL - TELUGU - KANNADA - MALAYALAM


SPIRIT
ప్రేమంటే
Thrill-u Praptirasthu!
A LEON JAMES MUSICAL
IN CINEMAS 21ST NOV, 2025 WORLDWIDE


సమర్పించు
సిస్టర్ రాణి మరియ గారి యదార్థ గాథ:
ద ఫేస్ ఆఫ్ ద ఫేస్లెస్ (క్షమాపణ గాథ) తెలుగు లో...
2024 ఆస్కార్ అవార్డు కోసం నామినేట్ చేయబడిన చిత్రం
THE FACE OF THE FACELESS
2024 సంవత్సర ఉత్తమ క్రైస్తవ చిత్రం
ద ఫేస్ ఆఫ్ ద ఫేస్లెస్
123 అంతర్జాతీయ అవార్డులు
SHAISON P. OUSEPH
SANDRA D'SOUZA RANA
RANJAN ABRAHAM
TRI LIGHT CREATIONS
నవంబర్ 21 విడుదల


ANYUKTH RAM PICTURES
WORLD WIDE RELEASE
DECEMBER 12 2025
CH. RAMA RAO'S
ఘంటసాల
THE GREAT
PRODUCER Mrs CH. PHANI
DIRECTOR CH. RAMA RAO
KARRI BALAJI VASU RAO SALURI VENU MURALIDHAR .V DR. SHYAM KUMAR .P


SPIRIT
RETRO
BLOCKBUSTER
SPIRIT MEDIA AND WAYFARER FILMS PRESENT
DULQUER SALMAAN IN
కాంత
WRITTEN & DIRECTED BY SELVAMANI SELVARAJ
IN CINEMAS NOW

పుత్తూరు వార్తలు

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

● అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి



పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న జడ్జి రమ్యసాయి

పుత్తూరు అర్బన్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదాపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని పోలీసులను అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి ఆదేశించారు. డిసెంబర్ 13వ తేదీన పుత్తూరు కోర్టు ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జి రమ్యసాయి పేర్కొన్నారు. శనివారం ఆమె పోలీసులతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో రాజీకి లోబడిన క్రిమినల్, అన్ని రకాల సివిల్ కేసులను పరిష్కరించాలని సూచించారు.

మద్యం దుకాణం ఏర్పాటు తాత్కాలిక రద్దు

పుత్తూరు అర్బన్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గౌడ్ వైన్స్ దక్కించుకున్న నిర్వహకులకు దుకాణం ఏర్పాటు కష్టతరంగా మారుతోంది. ఈసలారం, కార్వేటినగరం రోడ్డులో ఏర్పాటును అడ్డుకున్నారు. శనివారం తిరుపతి రోడ్డులో ప్రారంభించాల్సిన దుకాణాన్ని మహిళలు అడ్డుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎక్సైజ్ శాఖ సీఐ మురళీమోహన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళల నుంచి వినతిని స్వీకరించారు. మద్యం దుకాణ నిర్వహకుడుకి ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని పరిశీలించుకోవాలని సూచించారు.

శుభ్రతతో రోగాలు దూరం

పుత్తూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు, వ్యక్తి గత శుభ్రతతో రోగాలను అరికట్టవచ్చని విశ్రాంత డాక్టర్ రవిరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు కోటేశ్వరయ్య, వెంకటకృష్ణయ్య, సుజన తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

పుత్తూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలు, చరిత్ర, భాగవత పురాణ పుస్తకాలను గ్రంథాలయంలో ప్రదర్శించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ ప్రదర్శనను ఎంఈవో తిరుమల రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మీనాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం

పుత్తూరు టౌన్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆరేటమ్మ కాలనీ అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదానం జరిగింది. ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి బృందం అన్నదానం చేసింది.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పుత్తూరు అర్బన్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో సంధ్య పేర్కొన్నారు. శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో తలెత్తే ఆరోగ్య సమస్యలను వివరించారు. బాల్య వివాహాలు చేసుకోబోమని, ఎవరికైనా జరుగుతున్నట్లు తెలిస్తే ఫిర్యాదు చేస్తామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్



పుత్తూరు అర్బన్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను పుత్తూరు మున్సిపల్ కమిషనర్ డి.వి.నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. పట్టణ అభివృద్ధి, మెరుగైన పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు.

వైభవంగా శ్రీవారి ఊంజలసేవ



వడమాలపేట, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): అప్పలాయ గుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి ఊంజలసేవ వైభవంగా నిర్వ హిం చారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో స్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి ఊయలపై అధిష్ఠింపజేసి ఊంజల సేవ నిర్వహించారు.అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాలాలు, మంగళ వాయిద్యాలు నడుమ తిరుచ్చి వాహన సేవలో మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం ఆలయానికి చేరుకొన్న స్వామివారికి మంగళహారతలిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మోటారు, పైపుల చోరీ

వడమాలపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలో సదాశివకోనకు వెళ్లే రోడ్డులో రైతు పొలం వద్ద బోరులోని మోటారు, పైపులు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు. శనివారం రైతు పొలంలోని బోరుబావిలో వడమాలపేట గుంటకట్టవీధికి చెందిన ఎస్. శివకుమార్ రూ.1.10 లక్షల విలువైన మోటారు, పైపులు చోరీ చేసినట్లుగా ఆధారాలతో గుర్తించినట్లు చెప్పారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ చోరీలో మరి కొంతమంది హస్తం ఉందని అనుమానం ఉందని, విచారణలో నిందితులను గుర్తిస్తామని ఎస్ఐ చెప్పారు.

దిస్కూల్ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి,నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ నిర్వహించిన ఓపెన్ స్కూల్‌డే పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణంలోని దిస్కూల్‌కు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఐఐటీ ఆధ్వర్యంలో ఓరియంటేషన్, టెక్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో 170మంది విద్యార్థులు పాల్గొనగా దిస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి కేతన్ ఉపన్యాస పోటీల్లో ప్రథమ బహుమతి, పదవ తరగతికి చెందిన రీతిక ద్వితీయ బహుమతి సాధించారు.వారిని కరస్పాండెంట్ జనార్దన రావు పవార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర సాంస్కృతిక విభాగ అధ్యక్షుడిగా బాల సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పనిచేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర సాంస్కృతిక విభాగ అధ్యక్షుడిగా నియమించినట్టు సంస్థ అధ్యక్షురాలు ఈశ్వరీ నాగభూషణం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ సాహిత్య, సాంస్కృతిక పరంగా తను సంస్థకు సేవలు అందిస్తానన్నారు.

గూడూరు సూళ్లూరుపేట/వెంకటగిరి

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు

గూడూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని విశ్రాంత డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదినారాయణ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్‌ను ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ప్రభాకర్‌రావు, క్లబ్ ప్రతినిధులు విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, కోదండయ్య, ప్రిన్సిపాల్ సింహాద్రి, పీడీ నారాయణరాజు పాల్గొన్నారు.

బాలికా విద్యాలయం ప్రహరీ పూర్తయ్యేదెన్నడో..?



అసంపూర్తిగా ఉన్న ప్రహరీ

తడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తడలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం ప్రహరీ అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారుగా 250 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తూ... అక్కడే వసతిని పొందుతున్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.50 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. 2019 ఎన్నికల నాటికి 70శాతం పనులు పూర్తయ్యాయి. తరువాత ప్రభుత్వం మారిపోవడంతో ప్రహరీ పనులు అటకెక్కాయి. నిధుల సమస్యతో నిర్మాణం ఆగిపోయింది. రైల్వే ట్రాక్‌కు పక్కన అనప గుంటకు వెళ్లే దారిలో ఉన్న ఈ విద్యాలయం చుట్టుపక్కల పశువులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ప్రహరీ లేకపోవడంతో పశువులు లోనికి ప్రవేశిస్తుండడంతో విద్యాలయానికి సంబంధించిన మంచినీరు, డ్రైనేజీ పైపులైన్‌లు దెబ్బతింటున్నాయి. అలాగే విషసర్పాలు వస్తుండడంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బాలికా విద్యాలయం ప్రహరీ పూర్తి చేయించాల్సిన అవసరం ఉంది.

రైతులకు అవసరమైనంత యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

గూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైనంత మేరకు యూరియా పంపిణీ చేస్తున్నామని పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి రైతుకూ యూరియా కార్డులు అందజేసి దాని ద్వారా ఎకరాకు మూడు బస్తాలు అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈవో తనిఖీలు



తీర్థంపాడు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో జగదీష్‌బాబు

దక్కిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థంపాడు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో జగదీష్‌బాబు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాప్రమాణాలను ఆరా తీశారు. తరగతి గదుల్లో బోధనా విధానాన్ని సమీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం పథకం అమలను పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆల్తూరుపాడు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

కోటి సంతకాల సేకరణ

గూడూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నరశింగరావుపేటలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, యామిని, మహేంద్రరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, నాశిన నాగులు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

చిట్టమూరు, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు సచివాలయంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని తహసీల్దార్ నరేష్, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, చిట్టమూరు పీఏసీ అధ్యక్షుడు గుండుబోయిన కస్తూరయ్య, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు నల్లారెడ్డి రాజేష్ రెడ్డి, వెదనపర్తి రాజగోపాల్ రెడ్డి, బసిరెడ్డి హరికృష్ణా రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

వెంకటగిరిటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లమ్మగుడి వీధిలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప పత్రితో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెంలో శనివారం అయ్యప్ప భక్తులకు అన్నదానం జరిగింది. స్థానిక గురునాథస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు భజనలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు. అయ్యప్పస్వామి చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదానం జరిగింది.

సూళ్లూరుపేటలో....

సూళ్లూరుపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయం సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద శనివారం సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అన్నదానం చేశారు. ముందుగా ఆలయంలో పూజలు చేసిన అనంతరం అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం చేశారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

బంగారు, వెండి, నగదు, బైక్ స్వాధీనం



నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, నగదు, స్కూటర్

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో పలు చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను చంద్రగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. బంగారం, వెండి, నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ప్రసాద్ వివరాల మేరకు.. కేఎంఎం కళాశాల వద్ద చంద్రగిరి పోలీసులు శనివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ముగ్గురు వ్యక్తులు తిరుపతి నుంచి పీలేరు వైపు బైక్‌పై వెళుతూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. విచారణలో వారు అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన రామాంజనేయులు, తిరుపతికి చెందిన సత్యసారథి, చాట్ల నరేంద్రలుగా తెలిసింది. వీరు చంద్రగిరి మండలంలో 8, తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చోరీ చేసినట్లు గుర్తించారు. రామాంజనేయులు గతంలో అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లో చోరీలకు పాల్పడి, జైలుకు వెళ్లి వచ్చినట్లు విచారణలో తెలిసింది. వారి నుంచి 50 గ్రాముల బంగారం, 1100 గ్రాముల వెండి, రూ.10 వేల నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు. సిబ్బందిని డీఎస్పీ అభినందించి, రివార్డ్ అందజేశారు.

మందుబాబులకు జరిమానా

వెంకటగిరి టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏడుగురు మందుబాబులకు వెంకటగిరి కోర్టు జడ్జి విష్ణువర్మ జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి రూ.10వేల చొప్పున, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి తీర్పు ఇచ్చినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

ఓజిలి: మండల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 9 మందికి రూ.90 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 9 మందిపై కేసులు నమోదు చేసి నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున 90 వేలు జరిమానా విధించారని చెప్పారు.

సూళ్లూరుపేట: మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి సూళ్లూరుపేట కోర్టు న్యాయమూర్తి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు, కోటలోని 1, 2 రేషన్ దుకాణాలను తహసీల్దారు జయజయరావు శనివారం తనిఖీ చేశారు. రికార్డులను, స్టాకును పరిశీలించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీ

బాలాయపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంబలపూడి గ్రామానికి చెందిన దుర్గ రత్నమ్మ తోటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దుండగులు పగులగొట్టి రాగి వైరును ఎత్తుకెళ్లారు. రత్నమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, శ్రీలక్ష్మమ్మకాలనీలలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి విగ్రహాలకు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవీంద్రబాబు

దక్కిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుపరిచేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీంద్రబాబు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్న ఫిర్యాదులు వస్తున్నాయని, కార్యదర్శులు సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కోటనాగయ్య, ఎంఈవో వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల గదికి మరమ్మతులు చేయించండి

సూళ్లూరుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలోని తమ గదికి మరమ్మతులు చేయించాలని తహసీల్దార్ పి.గోపినాథ్‌రెడ్డికి వీఆర్వోలు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డిని కలిసి తాము ఉంటున్న గది దుస్థితిని వివరించారు. కాలం చెల్లిన భవనంలో విధులు నిర్వహించలేకపోతున్నామని, తరచూ పెచ్చులూడి మీద పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్వోలు గదికి మమర్మతులు చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటరమణ, వెంకటయ్య, నీలిమ, శ్రీదేవి, అజంతా తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని నడింపల్లె వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో శనివారం సాయంత్రం ముందు వెళుతున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలం అనుకూరపల్లికి చెందిన లక్ష్మీకాంత్(20) తిరుపతిలోని తన బంధువులు ఇంట్లో ఉంటూ పూతలపట్టు మండలంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం తన ద్విచక్ర వాహనంపై కళాశాల నుంచి తిరిగి వస్తుండగా నడింపల్లె వద్ద ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా వేగాన్ని అదుపు చేయడంతో వెనుక వస్తున్న లక్ష్మీకాంత్ దాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులందరికీ యూరియా అందించండి

దొరవారిసత్రం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దు... చిన్న, సన్నకారు రైతులందరికీ యూరియా అందించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమే దొరవారిసత్రంలో నెలబల్లి సొసైటీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయితో మాట్లాడారు. మండలంలో చిన్న, సన్నకారు రైతులకు యూరియా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. రైతుసేవా కేంద్రాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని సూచించారు. రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. రైతుసేవా కేంద్రాలకు యూరియా సక్రమంగా సరఫరా కాకుంటే తన దృష్టికి తీసుకువస్తే కలెక్టర్‌తో సమస్య పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు మాధవ్‌నాయుడు, నెలబల్లి సొసైటి డైరెక్టర్లు సంచి విజయ్‌కుమార్, ఏకొల్లు మాజి ఎంపిటిసి ఉదయ్‌కుమార్ ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, పక్కన పాలకమండలి చైర్మన్ సతీష్ యాదవ్

చిల్లకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి నూతన పాలకమండలి సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తమ్మినపట్నంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్‌గా కోట సతీష్ యాదవ్, సభ్యులుగా బక్తాని రామయ్య, కోప్పాల సుబ్రహ్మణ్యం, వి.మహాలక్ష్మి, యం.లక్ష్మమ్మ, కోలంగిరి కోటేశ్వరమ్మ, పాముల రవి, నెల్లిపుడి రాజేశ్వరమ్మ, కోడి పోలయ్య, ఆర్.రత్నమ్మ, దుబగుంట నిరంజన్‌రావు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఆలయ ఈవో గిరికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, మూగ శంకరయ్య, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణయ్య, గుండాల లీలావతి, నెల్లటూరు చిరంజీవి, పూడిపర్తి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పెనుబోలు జానకిరామిరెడ్డి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, నెల్లటూరు సుప్రజ, గుండాల శ్రీనివాసులు, మునిశేఖర్‌గౌడ్, పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయరాదని తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. చేశారు. మండలంలో భూ సమస్యలతో పాటు ఇతర పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో భూ సమస్యలు తలెత్తిన వెంటనే వీఆర్వోలు విచారణ చేసి పరిష్కరించాలన్నారు సూళ్లూరుపేట పట్టణంలోని పడమటి కండ్రిగ చెరువు ప్రాంతంలో 33 సర్వే నెంబరులో కొంతమేర ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయని, పరిశీలించి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

తడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొండపనాయుడు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తనిఖీల సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపేవారిని గుర్తించి కేసులు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపరచగా 9 మందికి రూ.90వేల జరిమానా న్యాయమూర్తి విధించారని తెలిపారు. అలాగే రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న వారికి కూడా జరిమాన విధించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ మరోసారి పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు.

గ్రంథాలయంలో పుస్తకాల ప్రదర్శన



పుస్తకాలను ఆసక్తిగా చూస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో గ్రంథాలయంలో శనివారం పుస్తకాలను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు విచ్చేసి పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు నవలలు, సాహిత్యం వంటి పుస్తకాలను చదివితే విజ్ఞానం పెంపొందడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లైబ్రరీ సిబ్బంది వంకా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటిని కూల్చేశారంటూ కలెక్టరేట్ వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ తమ ఇంటిని అకారణంగా కూల్చివేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని రాజేంద్రప్రసాద్, ఆయన బంధువులు శనివారం కలెక్టరేట్ వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేపట్టారు. మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించామని చెప్పినా వినకుండా మున్సిపల్ సిబ్బంది ఇంటిని తొలగించారని, అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని రాజేంద్రప్రసాద్, అతని బంధువు యోగా నంద్ తెలిపారు. న్యాయం చేయకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతామని రాజేంద్రప్రసాద్, ఆ ఇంట్లో నివాసముంటున్న సిరి చెప్పడంతో తిరుచానూరు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అధికారుల విధులకు ఆటంకం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టరేట్ ఏవో రమేష్‌బాబు తెలిపారు.

కేంద్రీయ విద్యాలయలో వార్షిక క్రీడా దినోత్సవం



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఏర్పేడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యాలయ ప్రాంగణంలో క్రీడా స్ఫూర్తితో ఈ వేడుకను నిర్వహించారు. ఈవెంట్ ఉదయం 10 గంటలకు ప్రారంభించి సాయంత్రం 5గంటలకు ముగించారు. వివిధరకాల ట్రాక్, ఫీల్డ్ ఈవెంట్లు, రేసులు, టీం పోటీలు నిర్వహించా రు. ముఖ్యఅతిథిగా వీఎంసీ కేవీ ఐఐటీ తిరుపతి చైర్మన్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్, తిరుపతి ఐఐటీ స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ఎన్ఎస్ మూర్తి, ఐసర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కగనశేఖరన్, ఐఐటీ తిరుపతి ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అయ్యప్ప హాజరయ్యారు. విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచి బహుమతులను కైవసం చేసుకున్నారు.

విద్యార్థులకు నిఘంటువుల పంపిణీ



విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేస్తున్న డీఈవో

కేవీబీపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం డీఈవో కేవీఎస్ కుమార్, జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీ శంకర్‌రావు ఆధ్వర్యంలో నిఘంటువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎఫ్ఏ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. మరింత మెరుగుపడాలన్నారు. కళత్తూరు, పాతపాళెం వరద బాధిత విద్యార్థులకు సమగ్ర శిక్ష, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యా కిట్లను అందజేశారు. అదే విధంగా రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ లింగుట్ల విద్యార్థులకు ప్లేట్లు, విద్యా సామగ్రి అందజేశారు. ఏఎంవో శివశంకరయ్య, సీఎంవో సురేష్, ఏపీవో సుధాకర్, ఐటీసెల్ ఇన్‌చార్జి ధనంజయలు నాయుడు, ఫౌండేషన్ ప్రతినిధి దేవరాజులు, ఏఎస్‌వో సారథి, భువనేశ్వరి, పుష్ప, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఇంటిని కూల్చేశారంటూ...

కలెక్టరేట్ వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన



పెట్రోల్ బాటిల్ ముందు పెట్టుకుని ఆందోళన చేస్తున్న రాజేంద్రప్రసాద్, సిరి తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అకారణంగా తమ ఇంటిని కూల్చివేసిన శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని రాజేంద్రప్రసాద్, ఆయన బంధువులు శనివారం కలెక్టరేట్ వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేపట్టారు. మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించామని చెప్పినా వినకుండా మున్సిపల్ సిబ్బంది ఇంటిని తొలగించారని, అడిగితే బెదిరింపులకు పాల్పడు తున్నారని రాజేంద్రప్రసాద్, అతని బంధువు యోగానంద్ తెలిపారు. నోటీసులు ఇవ్వకుండా ఇల్లు కూల్చివేయడం దారుణమన్నారు. న్యాయం చేయకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని రాజేంద్ర ప్రసాద్, ఆ ఇంట్లో నివాసముంటున్న సిరి చెప్పడంతో తిరుచానూరు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అధికా రుల విధులకు ఆటకం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని తిరుచానూరు పోలీసు లకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టరేట్ ఏవో రమేష్ బాబు తెలిపారు. కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య



ప్రశాంత్ (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొట్టంబేడు మండలం బసవయ్య పాళెంనకు చెందిన ప్రశాంత్(32) ఆటోడ్రైవర్. మూడు రోజుల క్రితం భార్య భార్గవితో గొడవపడ్డాడు. ఆమె ఇద్దరు పిల్లలతో పట్టణంలోని తల్లి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో మనస్థాపం చెందిన ప్రశాంత్ శనివారం భార్యకు వీడియో కాల్ చేసి తాను ఉరి వేసుకుంటున్నానని తెలిపాడు. ఆమె సమాచారంతో బంధువులు హుటాహుటినా ప్రశాంత్ వద్దకు చేరుకున్నారు. అయితే తలుపు ఎంత సేపటికి తీయక పోవడంతో కుటుంబసభ్యులు గదిలోకి ప్రవేశించి ఉరికి వేలాడుతున్న ప్రశాంత్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ప్రశాంత్ తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

జాబ్‌మేళాలో 102మందికి ఉద్యోగాలు



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్ సంస్థలు ఆధ్వర్యంలో శనివారం ఎంకేటీ కల్యాణ మండపంలో జరిగిన జాబ్‌మేళాలో 102 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగ నియామక పత్రాలను ఎమ్మెల్యే ఆదిమూలం అందించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ... నియోజక వర్గంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయన్నారు. ఉద్యోగాలు పొందిన వారు రూ.13, నుంచి రూ.25 వేల వరకు జీతం పొందుతారన్నారు. అన్నారు. ఎంపిక కాని వారికి త్వరలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వ పాలిటెక్నిక్ స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి వేడుక



నారాయణవనం, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయంలో ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉభయ నాంచారులతో కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో స్వామిఅమ్మవార్లను మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శనీశ్వరస్వామికి వేదోక్తంగా తైలాభిషేకం



శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ, గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు.

ముగిసిన పుట్టగొడుగుల పెంపకం శిక్షణ

రేణిగుంట నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పుట్టగొడుగులు పెంపకంపై నైపుణ్య శిక్షణ తరగతులు ముగిసింది. శనివారం చైతన్యపురం రాస్ కెవికె లో శిక్షణ తరగతులకు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర హెడ్ శ్రీనివాసులు మాట్లాడుతూ పుట్టగొడుగులు పెంపకంలో నాణ్యమైన ఉతత్తి పొందటానికి చేపట్టవలసిన శాస్త్రీయ పద్ధతులు మార్కెటింగ్ అవకాశాలు విలువ జోడింపు మొదలైన అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కె వి కే సిబ్బంది దివ్య సుధా ,రామ్ కుమార్ ,దివ్య ,అనుష తదితరులు పాల్గొన్నారు.

25న ఆగ్నేయ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా భేరివారి మండపం సమీపంలో కొలువై ఉన్న ఆగ్నేయ గణపతిస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టండి

ట్రాఫిక్ సమస్య, వాయు కాలుష్యాన్ని తగ్గించే దిశగా పరిశోధనలు చేయండి ● యువ శాస్త్రవేత్తలకు పిలుపు



యువశాస్త్రవేత్తలకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త ప్రకాష్ రౌత్

ఏర్పేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని వివిధ దేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. తిరుపతి ఐసర్ ప్రాంగణంలో రెండు రోజులుగా ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 91వ వార్షిక సదస్సు జరుగుతోంది. శనివారం పలు ఆవిష్కరణలు, పరిశోధనలపై శాస్త్రవేత్తలు చర్చించారు. ప్రధానంగా పట్టణాల్లో ట్రాఫిక్, వాయు కాలుష్యంపై ఏఐని వినియోగించి సమస్య పరిష్కార దిశగా పరిశోధనలు జరగాలని అభిప్రాయపడ్డారు. తిరుపతి, విజయవాడ, ఢిల్లీ తదితర నగరాల్లో వాయు కాలుష్యం తీవ్రత, వాటి కారకాలను విశ్లేషిం చారు. పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా పరిశో ధనలు జరగాలని పలువురు శాస్త్రవేత్తలు కోరారు.

మానవ మేధస్సు పెరగాలి

మానవ నిర్మిత మేధస్సు కృత్రిమ మేధస్సు ఎదుగుదలకు ఉపయోగపడాలని ఐఐఎస్సీ శాస్త్రవేత్త విజయచంద్రు సూచించారు. గత 50 ఏళ్లల్లో సమాచార, జీవశాస్త్రాల్లో జరిగిన విప్లవాత్మక పురోగతి, వాటి కలయికల ప్రభావం కృత్రిమ మేధస్సు ఎదుగుదల జీవ నిర్మాణాల క్లిష్టత వంటి అంశాలను చర్చించారు. ఈయన ఐఐఎస్సీ బయో ఇంజనీరింగ్ విభాగంలో విజిటింగ్ ఫ్యాకల్టీగా, ఎంఐటీలో డెసిషన్ సైన్సెస్ పీహెచ్‌డీ పొందారు. గణితశాస్త్రం ఆప్టిమైజేషన్, లాజిక్ బయాలజీ రంగాల్లో ఎన్నో పరిశోధనలు చేశారు. ఈయన ప్రసంగం పలువురు శాస్త్రవేత్తలను ఆకట్టుకుంది.

● ప్రపంచాన్ని పరుగులు పెట్టించే ఆవిష్కరణలపై యువ శాస్త్రవేత్తలు దృష్టి పెట్టాలని ప్రముఖ శాస్త్రవేత్తలు కోరారు. శనివారం పలు పరిశోధనలపై శాస్త్రవేత్తలు చర్చలు జరిపారు. ఆవిష్కరణలు ప్రపంచ గతిని మార్చివేస్తున్నాయన్నారు. టెక్నాలజీ అంటే ఏమిటో తెలియని రోజుల్లో చేసిన ఆవిష్కరణలు ప్రపంచానికి కొత్త దారిని చూపాయన్నారు. నాటి ఆవిష్కరణలు నేడు ఎన్నో సవాళ్లను ఎదుర్కొనేందుకు దోహదపడుతున్నాయన్నారు. శాస్త్రవేత్తల ద్వారానే మొబైల్‌ఫోన్లు, రేడియోలు, టీవీలు, ఎలక్ట్రో ఫోటోగ్రఫీ వంటివి అందుబాటులోకి వచ్చాయని అభిప్రాయపడ్డారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. వారాంతపు సెలవులు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శన టిక్కెట్ల ద్వారా 212 మంది, రూ.200 శీఘ్ర దర్శనం 2,207, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,366 మంది దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,616మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 850, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 308, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 231, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 103మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 52,731 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.



చైర్మన్ పర్యవేక్షణ

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీని ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి, ఈవో బాపిరెడ్డి పర్యవేక్షించారు. వారాంతపు సెలవులు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. దీంతో కంచు గడప వద్ద క్యూలైన్ల వద్ద సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం మెటల్ డిటెక్టర్ పరికరాలు, లగేజీ స్కానర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు ఆపల్గొన్నారు.

రైతులకు అందుబాటులోకి యూరియా



ఎరువుల పంపిణీలో గురవారెడ్డి తదితరులు

ఏర్పేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియాను ఎప్పటికపుడు అందిస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. మండలంలోని బండారుపల్లి, మన్నసముద్రంలలో రైతులకు ఎకరాకు మూడు బస్తాల చొప్పున యూరియా చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు వైసీపీ నాయకులు యూరియా కొరత ఉన్నట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు.టీడీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, హరి, తిరుపాల్ ధనంజయులురెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

పిచ్చాటూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు సొసైటీ బ్యాంకు ఆవరణలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సింగిల్‌విండో చైర్మన్ జయచంద్రనాయుడు మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతమే గ్రామీణాభివృద్ధికి పునాది అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం పరిశోధన, శిక్షణ సహకారం, విద్యా సంస్కరణ, త్రిభవన సహకారం, విశ్వ విద్యాలయ సహకార వ్యవస్థ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సొసైటీ డైరెక్టర్లు జయచంద్రరెడ్డి, నాగరాణి, నందగోపాల్, డీసీసీ బ్యాంకు మేనేజర్ శరవణ, సీఈవో దొరస్వామి, సూపర్‌వైజర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతను పాటించండి

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. అధ్యాపకులు సునీత తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదును సరి చూసుకోండి

నారాయణవనం, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): పంట నమోదును రైతులు సరిచూసుకోవాలని ఏవో శోభారాణి సూచించారు. శనివారం భీముని చెరువు రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను తెలియజేశారు. పంట తనిఖీ నిమిత్తం రైతు సేవా కేంద్రాలలో ముసాయిదా జాబితాను ప్రదర్శించామన్నారు. పంట నమోదుతో రైతులకు వడ్డీలేని రుణాలు, బీమా, మద్దతు ధరకు పంట ఉత్పత్తుల విక్రయాలు, విపత్తులతో పంట నష్ట పరిహారం పొందడానికి సాధ్యమవుతుందని తెలిపారు. సేవా కేంద్రాల్లో తమ అభ్యంతారాలను ఈనెల 18న మంగళవారం లోపు తెలియజేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ రమ్య, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు స్మార్ట్‌మీటర్ ఏర్పాటు

సత్యవేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్‌శాఖ సిబ్బంది స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. 50 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా, ఇందులో తొలి విడతగా 30 ట్రాన్స్‌ఫార్మర్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. ఏఈ వాసు దేవయ్య మాట్లాడుతూ... స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ వినియోగం ఏ మేరకు ఉంటుందో తెలుసుకోవచ్చన్నారు. గృహ అవసరాలకు, వాణిజ్య సముదాయాలకు వినియోగిస్తున్న విద్యుత్ తేడా తెలుస్తుందన్నారు.

స్వర్ణాంధ్రపై విద్యార్థుల ర్యాలీ

సత్యవేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు సత్యవేడులో శనివారం డీఎల్‌డీవో జాలిరెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మాస్టర్ స్కూల్ విద్యార్థులతో క్లాక్‌టవర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం, ఏఎస్‌వో త్రివిక్రమరావు, ఈవోపీఆర్డీ ముని రవికుమార్, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల మానవహారం

వరదయ్యపాళెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం వరదయ్యపాళెంలో పారిశుధ్య కార్మికులు మానవహారం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. పలువురుమాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని అంటురోగాలను తరిమికొడుదామన్నారు. బీజేపీ నాయకుడు పురుషోత్తం, తెలుగుమహిళ నాయకురాలు మునిభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై శిక్షణ

వరదయ్యపాళెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అత్మరక్షణపై శిక్షణ ఇచ్చారు. కరాటే మాస్టర్ కన్నయ్య విద్యార్థలకు శిక్షణ ఇస్తున్నట్లు హెచ్ఎం రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపేష్, దుష్యంత్‌రెడ్డి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, మోతీలాల్, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్టినేటర్

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులుఆయనను ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులునాయుడు, పోలూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళత్తూరువాసులకు చేయూత



కేవీబీపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు ముంపునకు గురైన కళత్తూరు, పాతపాళెం, అరుంధతి వాడలోని 90మందికి నిత్యావసర సరుకులను, చీరలను ఎస్ఎంఆర్ ఫౌండేషన్ అధినేత కుమార మోహన్‌రావు పంపిణీ చేశారు. మోహన్‌రావు గతంలో కేవీబీపురం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్లారు. కళత్తూరు దళితులకు అదే గ్రామానికి చెందిన అనిల్ రెడ్డి కుటుంబీకులు సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాధు భోజనం అందజేశారు.

పరశురామేశ్వరుడి సేవలో సినీనటుడు రవిప్రకాష్



ఏర్పేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని శనివారం సినీనటుడు రవిప్రకాష్ దర్శించుకున్నారు. మాజీ చైర్మన్ గిరినాయుడు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పిచ్చి మొక్కల తొలగింపు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పిచ్చి మొక్కలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ... కార్యాలయ ఆరవణ ఎచ్చి మొక్కలు నిండిపోవడంతో విషపురుగులు, పాములు, దోమలు విపరీతంగా ఉన్నాయని తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీంలో పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించామన్నారు.

నేడు జనసేన పార్టీ కార్యాలయానికి వినుత

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జనసేన నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కోట వినుత ఇటీవల ఓ హత్య కేసులో అరెస్టు అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని కోర్టు సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయానికి రానున్నట్లు ఆమె అభిమానులు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రతి ఒక్కరూ కోట వినుత నివాసానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.